సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



కాఫీ సాగుతో ఆర్థికాభివృద్ధి

కాఫీ సాగుపై గిరిజనులు దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి సాధించాలని పాడేరు కాఫీ బోర్డు ఎస్‌ఎల్‌వో సామర్ల రమేష్ అన్నారు. 8లో



ప్రకృతి సాగుతో లాభాలు 8లో

ప్రకృతి సాగుతో లాభాలు సాధించవచ్చని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త బాల హుస్సేన్‌రెడ్డి అన్నారు.

ప్రత్యేక అలంకరణ



తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోల మాంబ అమ్మవారిని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఖర్జూరం, జీడి పప్పు, వివిధ రంగుల బంతి, చామంతుల దండలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

స్వల్పంగా పెరిగిన కనిష్ట ఉష్ణోగ్రతలు



లంబసింగి ప్రాంతంలో పొగ మంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినా మంచు తీవ్రత అధికంగా ఉంది. మంగళవారం చింతపల్లిలో 10.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.పాడేరు డివిజన్ పరిధిలో జి.మాడుగులలో 11.9 డిగ్రీలు, జీకే వీధిలో 12.0 డిగ్రీలు,హుకుంపేటలో 12.1 డిగ్రీలు, అరుకువేలిలో 12.4 డిగ్రీలు, పాడేరులో 12.6 డిగ్రీలు, డుంబ్రిగుడలో 13.1 డిగ్రీలు,పెదబరడలో 13.2 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 15.3 డిగ్రీలు, అనంతగిరిలో 16.5 డిగ్రీలు, కొయ్యూరులో 16.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ఏడీఆర్ తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



బి. వెలమలకోట సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. పెదగెద్దాడ పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది ఎంతమంది ఉన్నారు, తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం పీవో మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో గర్భిణులకు రక్తహీనత లేకుండా ఏఎన్‌ఎంలు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం బి.వెలమలకోట సచివాలయాన్ని పరిశీలించారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

- జిల్లా కార్మికశాఖాధికారి సుజాత

పాడేరు : అసంఘటిత కార్మికులందరూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, తద్వారా సామాజిక భద్రత లభించడంతో పాటు వివిధ సంక్షేమ పథకాలు మంజూరవుతాయని జిల్లా కార్మిక శాఖ అధికారి టి.సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వారికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డుతో యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. నమోదైన కార్మికులకు రూ.2లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం చెందితే రూ.2లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.ఒక లక్ష బీమా సదుపాయం కల్పిస్తారని తెలిపారు. 16నుంచి 59 సంవత్సరాల వయస్సు గలవారు అర్హులన్నారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం లేనివారు కూడా అర్హులని పేర్కొన్నారు. జిల్లాలోని అసంఘటిత కార్మికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



వై.రామవరం ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వై.రామవరం: మండలకేంద్రమైన వై.రామవరంలో ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, మండలంలోని లోతట్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి, అనుమానాస్పద ప్రదేశాల్లో మంగళవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో స్థానిక ఎస్‌ఐ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: లివిటిపుట్టు వద్ద పోలీసులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ కె.పాపినాయుడు ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి గుంటసీమ వైపు, అరమ, తూటంగి వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

ఏమిటీ కష్టం

ఉద్యాన వన వాణిజ్య పంటల్లో ప్రధానమైన జీడిమామిడికి కాండం, వేరు తొలిచే పురుగు తరువాత అధిక నష్టం కలిగించేది తేయాకు దోమ (టీ దోమ). ఇది నిజంగా దోమకాదు. కూర్చున్నప్పుడు దీని శరీర నిర్మాణం దోమ లాగ ఉండడం, తేయాకు తోటల్లో ఎక్కువగా కనిపించడం వల్ల దీన్ని తేయాకు దోమ అని పిలుస్తుంటారు. జిల్లాలో జీడిమామిడి తోటలను టీ దోమ ఆశించడంతో పూత మాడిపోతూ రైతు ఆశలను ఆడియాశలు చేస్తోంది.



జీడిమామిడి తోట



టీ దోమ

- జీడిమామిడికి దోమపోటు
- పూతను ఆశించిన టీ దోమ
- వాతావరణ మార్పులతో ఆలస్యమైన పూత
- జిల్లాలో 24 వేల హెక్టార్లలో జీడిమామిడి సాగు

రంపచోడవరం: గిరిజన రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే జీడిమామిడి జిల్లాలో సుమారు 24వేల హెక్టార్లల్లో సాగవుతోంది. జీడిమామిడి సాగులో టీ దోమ నవంబర్,డిసెంబర్, జనవరి నెలల్లో వ్యాపిస్తుంది. ఈ టీ దోమ పూతదశ నుంచి పంట చేతికందే వరకూ కనిపిస్తుంది. లేత ఆకులు, పూత మాడిపోతాయి. పక్వానికి రాని గింజలు ముందుగానే రాలిపోతాయి. గింజలపై మచ్చలు, చారలు ఏర్పడి నాసిరకంగా తయారవుతాయి. దీని ప్రభావం వల్ల చెట్టు పాలి పోయినట్టుగా కనిపిస్తుంది. ఈ దోమ లేత కొమ్మలు, రెమ్మలు పైన వాలి వాటి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురులాంటి పదార్థం కారుతూ నల్లని చారలు ఏర్పడతాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జీడి తోటలను ఇప్పుడీ దోమ ఆశించినట్టు రైతులు తెలిపారు.

కలుపు మొక్కలపై ఆవాసం

టీ దోమ సాధారణంగా కలుపు మొక్కలపై ఆవాసం ఉంటుంది. లేత ఆకులు, పూతల నుంచి రసాన్ని పీల్చుకుంటుంది. జీడిమామిడిలో నవంబరు, డిసెంబరు,జనవరి నెలల్లో లేత చిగుళ్లతో పూతకు వస్తాయి. ఆ సమయంలోనే టీ దోమలు పూత, చిగుళ్ల రసం పీల్చడంతో పూత మాడిపోతుంది.



జీడిమామిడి పూతను ఆశించిన తెగులు

నివారణ చర్యలు ఇలా

జీడిమామిడి చెట్లు చిగురించినప్పుడు లాంబ్డా సైహలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లను లీటరు నీటికి లేదా అసిటామాప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. పూత కనిపించినప్పుడు రెండు, మూడు వారాల తరువాత ఇమిడాక్లోప్రిడ్ 0.6 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటికి కలిపి రెండోసారి పిచికారీ చేయాలి. కాయలు గోలీ సైజులో ఉన్నప్పుడు ట్రైజోఫాస్‌ను ఒక మిల్లీ లీటరను లీటరు నీటికి , లేదా లంబ్డా సైహలోత్రిన్ 0.6 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి మూడో సారి పిచికారీ చేయాలి.వీటితో పాటు వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

ఐటీడీఏ కొనుగోలు చేయాలి

జీడిమామిడి పిక్కలను కొనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారులు రైతులకు పంటకాలం కంటే ముందే డబ్బులను అడ్వాన్స్ ఇస్తారు. పంట చేతికొచ్చిన తరువాత మార్కెట్‌లో ఉన్న రేటు ఆధారంగా రైతుల నుంచి పిక్కలు కొనుగోలు చేస్తారు. గత ఏడాది కిలో జీడిపిక్కల ధర రూ. 130 నుంచి రూ. 180 వరకు పలికింది. ఈ ఏడాది ఐటీడీఏ వన్‌ధన్ వికాస కేంద్రాలు ద్వారా జీడి మామిడి పిక్కలు కొనుగోలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో 150 మెట్రిక్ టన్నుల జీడిమామిడి పిక్కలు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టారు. దిగుబడి తగ్గినా ఐటీడీఏ ద్వారా జీడిమామిడి పిక్కలు కొనుగోలు చేస్తే మంచి రేటు వస్తుందని గిరిజన రైతులు ఆశిస్తున్నారు.

జిల్లాలో జీడిమామిడి సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
అడ్డతీగల	8,725.81
అనంతగిరి	2,382.18
అరకు వేలి	26.15
కొయ్యూరు	13,002.58
గంగవరం	6,927.64
గూడెం కొత్తవీధి	48.75
జి మాడుగుల	14.64
డుంబ్రిగుడ	11.79
దేవీ పట్నం	2,407.54
పాడేరు	581.41
పెదబయలు	1.00
మారేడుమిల్లి	1,601.29
ముంచంగిపుట్టు	781.58
రాజవొమ్మంగి	5,600.48
రంపచోడవరం	9,137.66
వీఆర్ పురం	481.62
వై.రామవరం	6,421.20

ఈ ఏడాది పూత ఆలస్యమైంది



ఈ ఏడాది పూత ఆలస్యమైంది. వాతావరణంలో మార్పుల ప్రభావం పూతపై పడింది. ఇప్పుడు పూత మాడిపోతోంది. జీడిమామిడి కాపు ఎలా ఉంటుందోనని ఆందోళనగా ఉంది.

– కె బాపిరాజు, గోపవరం

మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు



పూత మొదలై పువ్వు విచ్చుకోక ముందు ఒకసారి, పూలు ఫలదీకరణ చెందిన తరువాత రెండోసారి, టీ దోమ ఉధృతిఎక్కువగా ఉన్నప్పుడు (కాయ గోలి సైజులో ఉన్నప్పుడు) మూడో సారి మందు పిచికారీ చేయాలి.సస్యరక్షణ చర్యలు కోసం రైతులు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చు.

– క్రాంతి,ఉద్యానవన శాస్త్రవేత్త, కేవీకే, పందిరిమామిడి

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

- కేంద్ర ఆర్థిక మంత్రికి అరకు ఎంపీ వినతి



కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ తనూజా రాణి, చెట్టి వినయ్

పాడేరు రూరల్: గిరిజనుల ఆర్థికాభివృద్ధికి బ్యాంకుల ద్వారా తోడ్పాటు అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి కోరారు. న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని ఎంపీ తనూజా రాణి, ఆమె భర్త చెట్టి వినయ్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో నూతన బ్యాంకులు ఏర్పాటు చేయాలని, గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ఆ బ్యాంకుల సేవలు ఉండాలని కోరినట్టు మంగళవారం స్థానిక విలేకరులకు ఫోన్‌లో ఎంపీ తెలిపారు. గిరిజన ప్రాంతంలో బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా అన్ని రకాల రుణాలు అందించాలని కోరినట్టు తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ తనూజారాణి చెప్పారు.

పీసా అవగాహన సదస్సులు రద్దు

రంపచోడవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పీసా అవగాహన సదస్సులు రద్దు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులను ఎప్పుడు నిర్వహించేది తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి

పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ సర్వేని రెండు రోజుల్లో పూర్తి చేస్తామని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చింతూరు డివిజన్ కూనవరం యూనిట్ -1 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నసరయ్య (భూ.సే) తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం మండలంలో పర్యటించి, లేళ్ళవాయి భూములను పరిశీలించారు. మొత్తం 167.50 ఎకరాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం టేకులబోరు ఎస్సీ కాలనీ, దేవుడి మాన్యంలో జరుగుతున్న ఇంటి వ్యాల్యూ సర్వేలను పర్యవేక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ స్ట్రక్చర్ వ్యాల్యూ సర్వే ముగియగానే సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఇంటి విలువ అంచనాలు రూపొందించే ప్రక్రియ చేపడతామని చెప్పారు. మార్చి 8న ఎన్నికల కోడ్ ముగియగానే గ్రామ సభకు సంబంధించి ఇంటి యజమానులకు నోటీసులు అందజేస్తామని, ఆ ప్రకారం తెలిపిన తేదీల్లో అవార్డు ఎంక్వయిరీ గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు. అదే సభలో అభ్యంతరాలు సేకరిస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో పిట్టల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్‌డీసీ నసరయ్య

అందరి కృషి ఫలితమే మాచ్‌ఖండ్‌కు అవార్డు

ఎస్‌ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు

ముంచంగిపుట్టు: అందరి సహకారం, కష్టపడి పనిచేయడం వల్లే మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి అవార్డు లభించిందని ప్రాజెక్టు ఎస్‌ఈ ఎ.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. 2023–24 సంవత్సరంలో మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధించిన ఆంధ్ర,ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు లభించింది. ఏపీజెన్‌కో ఎండీ చేతుల మీదగా ప్రాజెక్టు ఎస్‌ఈ, అధికారులు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రాజెక్టు ఆడిటోరియంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది,కార్మికులతో నిర్వహించిన అభినందన సభలో విద్యుత్ ఉత్పత్తికి విశేషంగా కృషి చేసిన పలువురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు,బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎస్‌ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ మాచ్‌ఖండ్‌లో 863 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రాజెక్టు ఉద్యోగుల అద్భుత పనితీరుకు నిదర్శనమన్నారు. మాచ్‌ఖండ్ ప్రాజెక్టు చరిత్రలో ఇది మూడవ అత్యధిక ఉత్పత్తి అని చెప్పారు. ప్రాజెక్టుకు అవార్డు రావడం ఉద్యోగులు,ఇంజినీర్ల బాధ్యత ను మరింత పెంచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ(జనరేషన్) గోవిందరాజులు, ఈఈ (సివిల్)కురేషు ప్రధాన్, డిప్యూటీ ఈఈలు సత్యకిరణ్, సాంబశివకుమార్, ఒబుల్‌రెడ్డి, భుజసుందర్‌పాడి, గంగభవాని, ఎస్‌ఈ కార్యాలయ సిబ్బంది సురేష్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్‌ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు







ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి, ప్రమాణం చేస్తున్న సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న అభ్యర్థులు కోసూరు రాధాకృష్ణ, పాకలపాటి రఘువర్మ

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఆర్వో సమక్షంలో ప్రమాణం చేశారు. ఏపీటీఎఫ్ మద్దతుదారుగా బరిలోకి దిగిన పాకలపాటి రఘువర్మ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేయగా, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఒక్కో సెట్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. రఘువర్మ వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మద్దతుదారులు తరలి వచ్చారు.

పనులు చేయకుండా కబుర్లు చెప్పొద్దు

కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : పనులు చేయకుండా, లక్ష్యాలు సాధించకుండా కబుర్లు చెప్పవద్దని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం, వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖ, పౌరసఫరాల శాఖ, సెరీకల్చర్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనుల పురోగతిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు నీడ తోటల పెంపకానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. రానున్న ఐదేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించాలన్నారు. వరి, రాజ్‌మా పంటలకు ఈకేవైసీ చేయించాలని సూచించారు. రబీ సీజన్‌లో ఈ-క్రాప్ బుకింగ్ మేరకు అథంటికేషన్ పూర్తి చేయాలన్నారు. కూనవరం, చింతూరు మండలాల్లో ఉద్యానవన నర్సరీలు, పాడేరు, రంపచోడవరం డివిజన్లలో వెదురు నర్సరీలు ఏర్పాటు చేయాలన్నారు. ముంచంగిపుట్టు మండలంలో కేజ్‌కల్చర్ రెన్యువేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో మల్బరీ సాగును విస్తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి.నందు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

బాల్యవివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బాలికల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను సామాజిక సమస్యగా గుర్తించి, అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఎంపీడీవోలు వర్క్‌షాపులు నిర్వహించాలని, 430 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. 15 రోజులకు ఒక్కసారి బాల్య వివాహాల నివారణపై కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. మిషన్ వాత్సల్యను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీడీ రజిని, జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ సీడీపీవోలు పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- సబ్‌కలెక్టర్ కల్పశ్రీ



నేలదోనెలపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటిస్తున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, రెవెన్యూ అధికారులు

గంగవరం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస (ఆర్‌అండ్ ఆర్) కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. నేలదోనెలపాడు, కొండమొదలు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కొండమొదలు పంచాయతీ గ్రామాల నిర్వాసితులు, సర్పంచ్ వెట్ల విజయ పలు సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, వీధి రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందని కుటుంబాలకు త్వరితగతిని ప్యాకేజీ అందించాలని సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణరాలు, వీఆర్వోలు సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవా నమోస్తుతే..!



సూర్యప్రభ వాహనంపై తిరువీధిలో సూర్యభగవానుడిగా అప్పన్న

సింహాచలం : సింహగిరిపై మంగళవారం రథసప్తమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న రాతిరథంపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సూర్యభగవానుడిగా భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, ఆళ్వారులను మేళతాళాల మధ్య తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలోని హంసమూలన ఉన్న రాతిరథంపై ఉదయం 8గంటలకు వేంజేంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, గంగధార జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అరుణపారాయణ నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. అలాగే సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను సూర్యప్రభవాహనంపై వేంజేంపజేసి సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. తిరువీధిలో స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చక్రపాణి, వేద పండితులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు స్వామిని దర్శించుకున్నారు.



రాతిరథంపై ఉన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

12వేల మంది విద్యార్థులతో యోగాసనాలు

- కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: జిల్లాలో వచ్చేనెల 8వ తేదీన 12వేల మంది విద్యార్థులతో యోగాసనాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. అందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు, హుకుంపేట,జి.మాడుగుల, అరకులోయ మండలాల గిరిజన సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో వారానికి రెండు సార్లు విద్యార్థులతో యోగాసనాలు వేయించాలని సూచించారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, డీడీ రజినీ, యోగాగురువు పతంజలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో ధాన్యం కొనుగోళ్లు

- సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ గణేశ్‌కుమార్



రాజవొమ్మంగిలో ధాన్యం బస్తాల లోడ్ (ఫైల్)

రాజవొమ్మంగి: ఈ ఏడాది అల్లూరి జిల్లాలో 26, 500 మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 25,749 టన్నులు కొనుగోలు పూర్తయినట్టు సివిల్‌సప్లయ్స్ జిల్లా మేనేజర్ గణేశ్‌కుమార్ అన్నారు. ఆయన ఫోన్‌లో వివరాలు అందజేశారు. కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ. 59.22 కోట్లు కాగా, ఇప్పటికి రైతులకు రూ. 56.42 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. దేవీపట్నంలో 4, 892 మెట్రిక్ టన్నులు, రాజవొమ్మంగి మండలంలో 4, 659, చింతూరు మండలంలో 4, 354 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మరో టన్ను వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల కోసం 45 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రకృతి సాగుతో లాభాలు

చింతపల్లి: గిరిజన రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సేద్య విధానాలను ఆచరించాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం విస్తరణ విభాగ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గొందిపాకలు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు మాట్లాడుతూ ప్రకృతి సాగుపై రైతులు దృష్టి సారించాలని, దీంతో అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులు, నీటి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తదితర అంశాలను వివరించారు. భూసార శాస్త్రవేత్త జోగారావు, ఉద్యాన సహాయకులు శోభన్, రైతులు సింహాచలం, కుశలవుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసూర్యనారాయణ.. వేద పారాయణ..

రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



సూర్యనారాయణమూర్తి ఆలయం వద్ద భక్తజన సందోహం



శారద నదిలో సామూహికంగా సూర్యనమస్కారాలు నిర్వహిస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న సూర్యనారాయణమూర్తి

అనకాపల్లి: ప్రత్యక్ష దైవానికి **జగతి భక్తితో ప్రణమి**ల్లింది. సకల జీవరాశులకు **ప్రాణశక్తిని ఇచ్చి చల్లగా** చూసే లోకబాంధవుడికి ప్రీతికరమైన రథసప్తమి రోజున ఆ దివ్యతేజోమూర్తి కరుణా కటాక్షాల కోసం అఖిల భక్తకోటి అంజలి ఘటించింది. ప్రభాకరుడి ఆలయాలలో ఆదిత్య హృదయ పఠనం మార్మోగింది. రాజుపాలెం సూర్యనారాయణస్వామిని వేలాదిమంది భక్తులు మంగళవారం దర్శించుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో నిలిచారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవాదళ్ సభ్యులు భక్తులకు ఎక్కడికక్కడ సహకరించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. ఇరుకైన రహదారి కావడంతో వాహనాలు అడ్డుగా ఉండడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో రూరల్, పట్టణ, ట్రాఫిక్ సీఐలు అశోక్‌కుమార్, టి.వి.విజయకుమార్, ఎం.నారాయణమూర్తి ఆధ్వర్యంలో సుమారు 150 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరావు, కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రాజుపాలెం పరిసర ప్రాంతంలో రథంపై కమిటీ సభ్యులు ఊరేగించారు. వ్యాపారవేత్త బంగారు సూరిబాబు, ఆదిబాబు దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి స్టేజ్ ప్రోగ్రాంలు, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. భారీ బాణాసంచాతో ఆలయ పరిసరాలు కాంతులీనాయి.

శారద నదీ తీరంలో సూర్య నమస్కారాలు

మాడుగుల: సత్యవరం గ్రామంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శారద నది ఒడ్డున తెల్లవారక ముందే పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, సూర్యనమస్కారాలు ఆచరించారు. నది ఒడ్డున పాయసం తయారు చేసి సూర్యదేవునికి సమర్పించి, ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచారకుడు సన్యాసిశెట్టి మాట్లాడుతూ నదిలో రథసప్తమి రోజున స్నానం చేసి, సూర్యనమస్కారాలు చేస్తే ఆరోగ్యంతోపాటు కోటి జన్మల పుణ్యం వస్తుందన్నారు. హిందూ ధర్మ ప్రచార ససభ్యులు బోదా పాల్గుణ, ఎం.రాజేశ్వరి, నానుబిల్లి రాజేశ్వరి, గెంజి మాలతి, మిరియాల సత్యవతి, గాడి కొండతల్లి, గెంజి ఈశ్వరి, చినమ్మలు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త పేరాడ తిలక్



చాపరాయి తిలకించిన అనంతరం మాట్లాడుతున్న టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్

డుంబ్రిగుడ: రాష్ట్రాభివృద్ధితో పాటు అల్లూరి జిల్లా మరింతగా అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ స్పష్టం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందించారన్నారు. శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు రామరావు, నందిగామ ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరావులతో కలిసి ఆయన మంగళవారం చాపరాయిలో పర్యటించారు. చాపరాయి అందాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు జగనన్నపై చూపిస్తున్న అభిమానం, ప్రేమ, అప్యాయత హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారం చేపడుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబు పాలనతో గిరిజనులకు ఒరిగేదేమీ లేదన్నారు. అరకుతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారన్నారు. ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే విశాఖపట్నంను రాష్ట్ర రాజధానిగా జగనన్న ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయి విశాఖపట్నం రాజధానిగా చూడాలని కోరుకుంటున్న ప్రతి ఒక్కరి కలను సాధ్యం చేస్తారన్నారు. ఆయనతో పాటు టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు హెమచంద్రరాజు, నందిగామ మాజీ ఎంపీపీ చక్రవర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

- లక్ష్మీపేటలో అమలుకాని ఎన్నికల కోడ్
- తొలగించని టీడీపీ జెండా



లక్ష్మీపేట కూడలిలో టీడీపీ జెండా

పెదబయలు: మండలంలో ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు కావడం లేదు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఆరు రోజులైనా గ్రామాల్లో రాజకీయ పార్టీల జెండాలు దర్శనమిస్తున్నాయి. మండలంలో లక్ష్మీపేట పంచాయతీ కేంద్రంలో కూడలిలో తెలుగుదేశం పార్టీ జెండా దర్శనమిచ్చింది. కోడ్ నిబంధనలు అమల్లో ఉన్నా కూడలిలో టీడీపీ జెండా ఎగురుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన 24 గంటల్లో గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, జెండాలు తొలగించాల్సి ఉంది, కానీ మండలంలో అమలు కావ డం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సక్రమంగా ఎన్నికల కోడ్ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాఫీ సాగుతో ఆర్థికాభివృద్ధి

ముంచంగిపుట్టు: కాఫీ సాగుపై గిరిజనులు దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి సాధించాలని పాడేరు కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో సామర్ల రమేష్ అన్నారు. మండలంలోని కర్రిముఖిపుట్టు, కించాయిపుట్టు, పనసపుట్టు పంచాయతీల్లో 20 గ్రామాల్లో మంగళవారం పాడేరు కాఫీ బోర్డు అధికారులు పర్యటించారు. కాఫీ కల్లాల నిర్మాణాలకు సర్వే చేశారు. పూర్తయిన కాఫీ కల్లాలను పరిశీలించారు. కాఫీ రైతులతో మాట్లాడి కాఫీ ఫిక్కల ధరలు, సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, కల్లాల నిర్మాణాల్లో కొలతలను వివరించారు. ఈ సందర్భంగా పాడేరు కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో సామర్ల రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కాఫీ సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి, సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. ఐటీడీఏ ద్వారా అందిస్తున్న సహకారం సద్వినియోగం చేసుకోవాలని, రాయితీలను వినియోగించుకోవాలని కోరారు.ముంచంగిపుట్టు మండలంలో 250 కాఫీ కల్లాలు మంజూరైనట్టు చెప్పారు. ఒక్కో కాఫీ కల్లం నిర్మాణానికి రూ. 27,500 చొప్పున అందించనున్నట్టు తెలిపారు. సకాలంలో కాఫీ కల్లాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన రైతులను కోరారు. ఐటీడీఏ ఏవో శ్రీరాములు, కాఫీ లైజన్ వర్కర్లు జగన్నాథం, నర్సింగ్, హరికృష్ణ, గోపాల్, రామచంద్ర, రామ్మూర్తి, ఈశ్వర్‌రావు, యుగంధర్ పాల్గొన్నారు.

షబ్నమ్‌కు ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో క్రికెటర్ షబ్నమ్ షకీల్‌కు స్వాగతం పలుకుతున్న జియ్యాని విజయ్

గోపాలపట్నం: ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన అండర్–19 మహిళల టీ–20 ప్రపంచ కప్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచిన నగరానికి చెందిన షబ్నమ్ షకీల్ మంగళవారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు 52వ వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్, క్రికెట్ అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఇటీవల విశాఖకు చెందిన క్రికెటర్లు మంచి ప్రతిభ చూపిస్తున్నారని అన్నారు. మహిళా క్రికెట్‌లో షబ్నమ్ షకీల్, పురుషుల క్రికెట్‌లో నితీష్ కుమార్‌రెడ్డి మంచి ప్రతిభ కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించారన్నారు. షబ్నమ్ ఈ ప్రపంచ కప్ సాధనలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. అనంతరం షబ్నమ్ తల్లిదండ్రుల్ని ఘనంగా సత్కరించారు.

తల్లిదండ్రుల ఆశీస్సులే కారణం

ప్రపంచ కప్‌లో ఘన విజయం సాధించడంలో తల్లిదండ్రుల ఆశీర్వాదం, వారి ప్రోత్సాహమే ప్రధాన కారణమని షబ్నమ్ అన్నారు. విశాఖ విమానాశ్రయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. తన తల్లి దండ్రులు ఎంతో కష్టపడి తనకు శిక్షణ ఇప్పించి, ఈ స్థాయికి తీసుకు వచ్చారని పేర్కొన్నారు. ప్రపంచ కప్ టోర్నీలో అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ కప్ మ్యాచ్‌లలో ఎటువంటి ఒత్తిడికి గురవకుండా ఆటను ఎంజాయ్ చేసినట్లు చెప్పారు. అందుకే మంచిగా రాణించి కప్ గెలిచామన్నారు.

మహిళ కడుపులోంచి కణితి తొలగింపు



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి

చింతూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా ఓ గిరిజన మహిళ కడుపులోంచి భారీ కణితిని తొలగించారు. కూనవరం మండలం కొండాయిగూడెంకు చెందిన మడకం సింగమ్మ ఏడాది కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. గత ఏడాది సెప్టెంబరులో తెలంగాణలోని భద్రాచలంలో ప్రైవేటు ఆస్పత్రిలో స్కానింగ్ చేయించగా కడుపులో 2.7 కేజీల కణితి ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. దానిని తొలగించేందుకు రూ.70 వేల వరకు ఖర్చవుతుందని తెలపడంతో అంత ఆర్థికస్తోమత లేని సింగమ్మ అలాగే మిన్నకుండిపోయింది. కాగా చింతూరు ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స నిర్వహిస్తారని తెలుసుకుని గత నెల 28న సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డిని సంప్రదించింది. ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన ఆయన మరోమారు పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సకు ఏర్పాటు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ రమణారావు సహకారంతో మత్తు వైద్య నిపుణుడైన డాక్టర్ కోటిరెడ్డి కలసి ఆమెకు మంగళవారం శస్త్రచికిత్స నిర్వహించి 2.7 కిలోల కణితిని తొలగించారు. వైద్యులకు సింగమ్మ, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యకర జీవన విధానంతో క్యాన్సర్ దూరం



పాడేరులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

పాడేరు : ఆరోగ్యకరమైన జీవన విధానం, ముందస్తు నిర్ధారణ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి నుంచి మెయిన్ బజార్, పాత బస్టాండ్, సినిమాహాల్ సెంటర్ మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, గుట్కా, ఖైనీ, తంబాకు, పాన్ సేవించడం వంటి అలవాట్లకు, బహుళ లైంగిక విధానాలు, అసురక్షిత లైంగిక సంబంధాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలని, ఆరోగ్యకరమైన సంపూర్ణ పోషక ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని చెప్పారు. క్యాన్సర్ నిర్ధారణ కోసం ఇంటి వద్దకు వచ్చే స్క్రీనింగ్ బృందానికి పూర్తిగా సహకరించాలని తెలిపారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో కూడా ఇటీవల క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, సీనియర్ వైద్యులు డాక్టర్ పుండరి, డాక్టర్ టి. ప్రతాప్ పాల్గొన్నారు.

జోలాపుట్టు జలాశయంలో విద్యార్థి మృతదేహం లభ్యం



జోలాపుట్టు జలాశయం ఒడ్డుకు తీసుకువచ్చిన విద్యార్థి అమిత్ హంతాల మృతదేహం

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా సరిహద్దులో ఉన్న జోలాపుట్టు జలాశయంలో గల్లంతైన ఇద్దరు విద్యార్థుల్లో ఓ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహాన్ని ఓడీఆర్ఏఎఫ్ బృందాలు బయటకు తీశాయి. జలాశయంలో నాటు పడవ మునిగిన ప్రదేశంలో అమిత్ హంతాల(15) మృతదేహాన్ని ఓడీఆర్ఏఎఫ్ బలగాలు మంగళవారం మధ్యాహ్నం గుర్తించాయి.పెద్ద రాళ్ల మధ్యలో చిక్కుకుని ఉన్న మృతదేహాన్ని అతికష్టం మీదగా బయటకు తీశారు. కొడుకు మృతదేహాన్ని చూసిన అమిత్ తండ్రి గోవర్ధన్ గుండెలవిసేలా రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి జోలా పుట్టు ఆస్పత్రికి పోలీసులు తరలించారు.మరో విద్యార్థి శివ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుడు అమిత్ కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, డిప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్ర సాహు, ఆర్ఐ పార్వతి రూ.20వేలను అందజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



జి.మాడుగులలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

జి.మాడుగుల: ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో పనిచేస్తున్న వైద్యాధికాలు, వైద్య సిబ్బంది విధుల నిర్వహణ పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా చెప్పారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారంఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ జరిగిన ఆశాడే రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు సకాలంలో సక్రమంగా వ్యాక్సిన్‌లు అందించాలని ఆయన ఆదేశించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్, డాక్టర్ ధనుష్, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు



గంజాయి కేసులో నిందితుడితో ఎస్ఐ ఈశ్వరరావు, పోలీసులు

అనకాపల్లి : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న మండలంలోని కూండ్రం గ్రామానికి చెందిన మొల్లి గంగునాయుడుని మండలంలో కొత్తూరు జంక్షన్ వద్ద బైక్‌పై వెళుతుండగా మంగళవారం పట్టుకోవడం జరిగిందని పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు చెప్పారు. గతంలో గంజాయి కేసులో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నలుగురుని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చడం జరిగిందని, మరో వ్యక్తి గంగునాయుడుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ చెప్పారు. నిందితుడి నుంచి పల్సర్ బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఫార్మాసిటీలో ప్రమాదం

- కాంట్రాక్టు కార్మికుడికి స్వల్ప గాయాలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో కామన్ ఎంప్లాయిస్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు కరణం ముత్యాలనాయుడు(45) గాయపడ్డాడు. పైపులైన్ రిపేర్లు చేస్తున్న సమయంలో విడుదలైన రసాయనం ముత్యాలనాయుడి ముఖంపై పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ముత్యాలునాయుడు సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందినవాడు. సమాచారం అందుకున్న యాజమాన్యం క్షతగాత్రుడిని వైద్యం కోసం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు కోలుకుంటున్నాడని పరవాడ పోలీసులు చెప్పారు. యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగానే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. ప్రమాదంలో గాయపడిన ముత్యాలనాయుడికి మెరుగైన వైద్యం అందించి, కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



వేడుకలో పాల్గొన్న అర్చకులు



కోలాటం ఆడుతున్న మహిళలు



పూజలు చేస్తున్న భక్తులు

పాడేరు రూరల్: మండలంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు, మండలంలో డి.గొందూరు పంచాయతీ సూకురుపుట్టు గ్రామంలో కొలువై ఉన్న సూర్యనారాయణస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడు రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి అర్చకులు తరలివచ్చి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.